# చెట్టుకింద రంగయ్య

రంగయ్యకి అమ్మా నాన్న లేరు.

పోనీ, ఇల్లూ డబ్బూ వయస్సూ ఉన్నాయా అంటే, అవీలేవు.

పన్నెండేళ్ళ రంగయ్యకి పదిమంది చుట్టాలూ లేరు.

అయితే మట్టితో కుండలూ, పిడతలూ, ప్రమిదలూ చేసే తెలివుంది.

అంతే కాదు-

మట్టిబొమ్మలుచేసి వాటికి రంగులు వేస్తాడు.

అవిచూసి ఎంతబాగున్నాయో అంటారంతా.

ఎవరైనా అవి కొనుక్కుంటే, అతనికి డబ్బులొస్తాయి.

వస్తే ఆపూట అన్నం తింటాడు - లేకపోతే లేదు.

ఏడుస్తూ చెట్టుకింద పడుకుంటాడు.

జాలిగల అమ్మ ఎవరేనా ఇంత అన్నం పెడితే తింటాడు. లేకపోతే లేదు.

వానవస్తే తనవొడిలోకి తీసుకుంటుంది చెట్టు. ఆ పెద్దచెట్టే రంగయ్యకి అమ్మా నాన్నా ఇల్లూ అన్నీను.

ఊళ్ళో అందరూ రంగయ్యని చెట్టుకింద రంగయ్య అని పిలుస్తారు. అలా అంటే రంగయ్యకి ఎంత సంబరమో -

అవును - చెట్టు తనది.

తనూ అదీ ఒక జట్టు.

అక్కడ ఉంటాడు - అక్కడే తింటాడు-అక్కడే పడుకుంటాడు. అది అతనికి

కథలు చెబుతుంది. జోకొడుతుంది. "ఇవాళ అన్నం తినలేదు ఆకలేస్తోంది" అని అప్పుడప్పుడు రంగయ్య ఏడుస్తాడు. చెట్టూ ఏడుస్తుంది. ఆకుల చివళ్ల నుంచి కన్నీళ్లు వాడిమీద పడతాయి. కితకితలు పెడతాయి. రంగయ్య నవ్వుతాడు. చెట్టు ఆకులు గాలికి గలగల మంటాయి. అవీ నవ్వుతాయి. ఇంక అంతా నవ్వులే!

ఓ రోజు ఊళ్ళో అమ్మ ఎవరేనా రంగయ్యకి అన్నం పెడుతుంది. ఇంకో రోజు రంగయ్య చేసిన బొమ్మ ఎవరో కొని ఇరవై పైసలిస్తారు. బన్ను కొనుక్కొంటాడు రంగయ్య. అది తిని నీళ్ళు తాగుతాడు. "కడుపునిండిందా?" అని అడుగుతుంది చెట్టు. కొమ్మలు ఊపుతూ మరీ అడుగుతుంది. గాలితో గుసగుసలు ఆడుతూ అడుగుతుంది. అప్పుడు రంగయ్యకి అమ్మ అన్నంపెట్టి బొజ్జ నిమిరినంత ఆనందం.

పగలంతా నీడ.

రాత్రంతా తోడు.

ఒక్కొక్క రాత్రి చందమామకూడా వస్తాడు వాళ్ళకి తోడు. చల్లగా వస్తాడు. పలకరిస్తాడు. పకపకా నవ్వుతాడు. చందమామ వెలుగులు పడి ఆకులంతా తళతళ. అవి చూసి రంగయ్య కళ్ళు మిలమిల. ముగ్గురూ ఆడుకుంటారు. నవ్వుకుంటారు. తెల్లారేదాక నవ్వులే నవ్వులు తెల్లగా హాయిగా.

ఆదివారంనాడు బడి ఉండదుగా? ఊళ్ళో పిల్లలంతా ఊరిబయట ఆ చెట్టు కిందకి వస్తారు.

ఒకటే అల్లరీ – కేకలూ పాటలూ –

కొంచెంసేపు తుమ్మడం – అదయ్యాక ముక్కులు గిల్లీలు – కాకీ నీ చెరువులో బుడుంగు – కోతి కొమ్మచ్చి – దొంగాట – ఎన్ని ఆటలో! ఆ రోజుల్లా రంగయ్యకి ఎంత బాగుంటుందో! ప్రమిదలూ బొమ్మలూ ఏం చెయ్యడు ఆ రోజు. తనూ ఆడతాడు అందరితోనూ. దాగుడుమూతలయితే రంగయ్యేతల్లి. దొంగ అయినవాడికి తల్లి కళ్ళు ముయ్యాలి. రంగయ్య నెప్పిపెట్టేలా కళ్ళుముయ్యడు. చేతులు అలా అడ్డుపెడతాడంతే! అతని ఒడిలో దొంగ కదలకుండా బొమ్మలా కూచుంటాడు. అప్పుడు రంగయ్యకి తను చేసే మట్టి బొమ్మ గుర్తుకొస్తుంది. అది తను చేసిన బొమ్మ. ఇది దేవుడు చేసిన బొమ్మ! రంగయ్య ఆలోచనలో పడతాడు. దేవుడు కూడా తనలాగే బొమ్మలు చేస్తాడా? తనూ ఆయనలాగ కదిలే బొమ్మలు చెయ్యగలడా? ఎదిగే బొమ్మల్ని? ఒదిగే బొమ్మల్ని?

అతిగా ఆలోచించకు అంటుంది చెట్టు. కొమ్మలు కదుపుతుంది ఆటలతో ఆదివారం నిముషంలో అయిపోతుంది.

ఇంక పండగొస్తే నిజంగా పండగే!

నాగుల చవితి వస్తుంది. ఎంతమంది అక్కలో, ఎంతమంది అమ్మలో! ఊళ్ళోవాళ్ళు అంతావస్తారు. చెట్టుపక్క పుట్టలో పాలుపోస్తారు. పోసివెళ్తూ చెట్టుకింద రంగయ్యకి చలిమిడి పెడతారు - చిమ్మిలి పెడతారు. జామి పండు ముక్కలు, అరటిపళ్ళు. కడుపు నిండిపోతుంది. కాని రంగయ్యకి ఆ రాత్రి నిద్ర ఉండదు. ఒకటే భయం. ఆ పుట్టలో పాము ఉందా? అది విష జంతువు కదా! దానికి పాలా? అదంతే ఇంత జాలా? జాలేమరి! మరి తనకి కూడా అన్నం పెడుతున్నారు కదా అప్పుడప్పుడు? ఊళ్ళో జనం ఎంతమంచివాళ్ళు? ఊరికేసి తిరిగి రెండుచేతులు జోడిస్తాడు రంగయ్య.

పీర్ల పండగవస్తే కన్నుల పండగే!

రకరకాల రంగుల బట్టలు, ఎన్నో రంగుల జండాలు. జండాల చివర జరీ అంచులు ఒకరి నొకరు ఆప్యాయంగా కౌగిలించుకోవడం. ఆనందించడం. అందరం ఒకటే అనుకోవడం. దేవుడిని తలుచుకొని తల నేలకి ఆనించిమరీ వేడుకోవడం. అది చూసి రంగయ్యకూడా తలని నేలకి ఆనించేవాడు. చెట్టుచుట్టూ పీర్లని నిలబెట్టాక రంగయ్యకి మనస్సు తేటపడినట్లయి, హమ్మయ్య అనుకొనేవాడు.

దసరా పండగవస్తే సరేసరి. దివిటీలతో దేవుడి పల్లకీ వచ్చేది రాత్రి. చెట్టుచుట్టూ తిరిగేది. ఎంతమంది జనమో - అందరూ అర్జునుడిమీద ఏదో చదివేవారు. కాగితాలమీద రాసి అవి చెట్టుకొమ్మలకి గుచ్చేవారు. పిడుగులు పడనీయకు అని కోరుకోవడం అది. లోకం బాగుండాలని. ఎంత గొప్ప మనస్సులో! ఎంత గొప్ప మనుష్యులో! రంగయ్య కళ్ళు, నీళ్ళతో నిండేవి. చెట్టుకీ ఆనందమే - దాని ఆకులకళ్ళల్లో కూడా నీళ్ళు.

దీపావళి పండగే బాగుండేది కాదు రంగయ్యకి. చెట్టు దగ్గరికి ఎవరూ వచ్చేవారు కాదు. ఊళ్ళో దీపాలూ మతాబులూ ఊరంతా వెలుగే - ఊరి బయటున్న చెట్టు దగ్గరమాత్రం చీకటి. అందరికీ వెలుగూ - తనకీ చెట్టుకీ చీకటి. చందమామ కూడా లేని చీకటి. అమావాస్య చీకటి.

దీపావళి అంటేనే రంగయ్యకి భయం. తనకి తెలిసి మూడు దీపావళులు గడిపాడు. ఆ రోజే రంగయ్యకి తెలిసేది. తను వేరూ, ఊళ్ళోవాళ్ళంతా వేరూ అని. మళ్ళీ ఎలాగని, ఏడుపు వచ్చేటంత బాధగా - అవును - తను వేరే - తను బీదవాడనీ, తనకి ఎవరూ లేరనీ అనుకుంటేనే ఏడుపు వస్తుంది. చెట్టుకూడా ఆ రోజు అదో

మాదిరిగా ఉంటుంది. కదలదు - మెదలదు - చీకట్లో కనిపించదు. పలకరించదు. ఆరోజు రంగయ్య వంటరివాడవుతాడు. నిజంగా ఏకాకి అవుతాడు. ఏడుపు వస్తుంది.

ఇవాళ సరిగా అలాగే ఉంది. తనకి ఎవరూ లేరనిపిస్తోంది. పైగా ఇవాళ అన్నం తినలేదు. ఎవరూ పెట్టాలేదు. పోనీ తను చేసినవాటిని ఎవరేనా కొని డబ్బులు ఇచ్చినా బాగుండును, అదీ లేదు.

రెండు రంగు పిడతలున్నాయి.

దీపావళినాడు వాటిలో అటుకులూ సెనగపప్పు బెల్లం వేసుకుతింటారు.

అయిదారు ప్రమిదలున్నాయి.

వాటిలో నూనెపోసి వత్తులు వేసి వెలిగించుకోవచ్చు.

కృష్ణుడి బొమ్మ ఒకటి ఉంది. పూజించు కోవచ్చు ఈ దీపావళినాడు.

ఊరంతా తిరిగాడు "ఏదో ఒకటి కొనండి. పది పైసలివ్వండి చాలు" అన్నాడు. "ఈ రోజుల్లో మట్టి పిడతలెవరికి కావాలి? రకరకాల ప్లాస్టిక్, స్టెయిన్‌లెస్ స్టీలువి వచ్చాయి" అన్నారు.

"అటుకులూ? పాత రోజులం"టూ ఫక్కున నవ్వారు.

"మట్టి ప్రమిదలు వద్దు - నిమిషనిమిషానికీ నూనె ఎవడు పోస్తాడు వాటిల్లో. పైగా ఆ నూనెజిడ్డుతో వళ్ళూ ఇల్లూ ఖరాబు - కొవ్వొత్తులు పెట్టుకున్నాంలే హాయిగా" అన్నారు.

సరే - ఇంక కృష్ణుడు బొమ్మకొనడానికి అసలే ముందుకి రాలేదెవరూ.

రోజులు మారాయి - ఆలోచనలూ మారాయి.

అంతేనా? ఇలా అన్నీ మారిపోతే పాతవన్నీ పోవలసినవేనా? తన మట్టి బొమ్మలు? ప్రమిదలు? పండగలూ, సరదాలూ అన్నీ మారిపోవడమే!

ఇన్ని మారాయిసరే - మరి తన ఆకలి మారలేదే - అది అలాగే ఉంది. జనం జాలి గుండెలు మారాయి. తన పేదరికం మాత్రం ఆమట్టునే ఉంది.

అందరూ మారారు - వాళ్ళ సంపదలూ మారాయి.

తనే మారలేదు - ఇంకా మట్టివే చేస్తున్నాడు అన్నీ. మరి - మారుతూన్న లోకంతో తనుకూడా మారిపోవాలి కాబోలు - కాని ఎలా మారడం? మారడం ఎలాగో తనకి చేతకాదే! ఏవిటి చెయ్యడం? ఏడుపు వచ్చింది రంగయ్యకి.

మంట - కడుపులో ఆకలి మంట. చెట్టుకి చెప్పుకున్నాడు. చెట్టుకదల్లేదు. జాలిగా అయినా కదల్లేదు.

కళ్ళు తుడుచుకున్నాడు. చివరిసారిగా ఊళ్ళోకి బయలుదేరాడు. వీధివీధికి తిరుగుతున్నాడు. "ప్రమిదలు - మట్టి ప్రమిదలు" అంటూ అరుస్తున్నాడు. "కొంటారా?" అని అడుగుతున్నాడు 'కొనండిబాబూ!' అని వేడుకుంటున్నాడు. రంగయ్య మాటలో జాలి - కంటిలో నీరు. వీధివీధికి తిరుగుతున్నాడు. వీధికి అటూ ఇటూ వెలుగుతూన్న మతాబులూ - ఆకాశంఅంతఎత్తు వెలుగు పువ్వుల్ని విర జిమ్ముతున్న చిచ్చుబుడ్లూ - పేలుతూన్న పటాసులూ - నవ్వులూ - కేరింతలూ -

అదో కాంతిలోకం -

దాని మధ్యలో బాధగా రంగయ్య. కదులుతూన్న రంగయ్య. మారలేని రంగయ్య. కాంతిలేని రంగయ్య. చీకటిరంగయ్య.

మారుతున్న లోకంతో మారలేని రంగయ్య. జీవంలేని మనిషిలా జీవనం కోసం నడుస్తున్నాడు. ఆదరణలేని చోట ఆశతో ఎదురుచూస్తున్నాడు. ఇంకొక్క అడుగు వేసే ఓపికలేదు. నీరసంతో తూలాడు - పడిపోయాడు.

ఆ సమయంలో వినిపించింది.

ఓ ముసలాయనగొంతు. "రంగయ్యా ఇటురా" అంటూ.

రంగయ్య అటు చూశాడు - చేత్తో పిలుస్తున్నాడాయన. నీరసంగా ఉన్న రంగయ్య కాళ్ళు అటు కదిలాయి.

"మా మనవరాలు తెగ పేచీ పెడుతోంది. ప్లాస్టిక్‌వి వద్దట - రంగు పిడతలే కావాలిట. అటుకు లేసుకుని ఆడుకుంటుందట. ఆ పిడతలతోబాటు ప్రమిదలు కూడా ఇయ్యి. ఈ కొవ్వొత్తులు చురచురలాడిపోవడమేకాని, నిలిచి కాలడం లేదు - అదేమిటీ? కృష్ణుడి బొమ్మా? ఎంత బాగుందో! నీ చేతిలో ఇంత కళ ఉందిరా రంగయ్యా - ఇలాంటి మట్టి బొమ్మల్ని చూస్తే విదేశీయులు తెగ ముచ్చట పడిపోతారు. బొమ్మ పది డాలర్లయినా సరే కొనిపట్టుకుపోతారు - ఏది? ఏది? ఇలా ఇయ్యి ఎంతబాగుందో - వీటి అన్నింటికీ ఎంత ఇమ్మంటావు? ఐదా? పది తీసుకో".

ముసిలాయన పర్సులోంచి పదిరూపాల నోటుతీసి చేతిలో పెడుతున్నప్పుడు, ఇది కలా నిజమా అనుకున్నాడు రంగయ్య. సంతోషంతో కళ్ళు తడి అయ్యాయి.

కదిలిపోయాడు. అంత పెద్ద నోటు అందుకున్నప్పుడు రంగయ్య చేతులు వణికాయి.

"నీరసంగా ఉన్నావు. అన్నం తినలేదు. ముందు లోపలికిరా - అన్నం తిను" అన్నాడాయన.

దగ్గరుండి ఆదరణగా అన్నం పెట్టించాడు. "బొమ్మల రంగయ్య - బొమ్మల రంగయ్య" అంటూ తన మనమరాలు అతనికి మరో రెండు మైసూర్‌పాక్‌లు వడ్డించినప్పుడూ, కొత్తగా కొన్న కృష్ణుడు బొమ్మని, చంటిపాపాయిని ఎత్తుకున్నట్లు ఎత్తుకొని, పట్టు పరికిణీతో మువ్వల పట్టీలతో గెంతుతూ, నాకీ వడ్డాణం వద్దు - కృష్ణుడి బొమ్మని ఎత్తుకున్నప్పుడు అడ్డం వస్తోంది" అంటూ ఆ వడ్డాణాన్ని పరుపుమీద పడేసినప్పుడూ ముసిలాయన మురిసిపోయ్యాడు.

"రంగయ్యా! నీ బొమ్మ మా 'మణి'కి బాగున్నట్టుంది. తెగ సంబరపడిపోతోంది. రోజూ ఓ కొత్త బొమ్మ చేసిపట్రా - అయిదు రూపాయలిస్తాను - అన్నం పెడతాను -- ఆ చెట్టు కింద ఎందుకు? ఇక్కడే, మా యింట్లోనే ఉందువుగాని - రోజూ బొమ్మలు చెయ్యి, రంగులకీ వాటికీ పెట్టుబడి నే పెడతాను. నువ్వు బొమ్మలు చేయ్యడం - నేను వాటిని మార్కెట్ చెయ్యడం, ఏం? ఈ ఒక్క ఊళ్ళోనే కాదు - రాష్ట్రం మొత్తం మీద - ఉహూ! దేశ వ్యాప్తంగా - కాదు - దేశదేశాలకి వెళ్ళేలాగ - ఆ వ్యాపారం అంతా నేను చూస్తాలే - నువ్వు ఊ అను"

రంగయ్యకి ఏం అర్థంకాలేదు - "ఊ" అనలేదు.

'నేను చెప్పింది నీకు అర్థం అయిందా?'

'అర్థం కాలేదు' అనలేక, చిత్తం అన్నాడు రంగయ్య. దణ్ణం పెట్టాడు.

"మరైతే ఆలశ్యం ఎందుకు? ఆ చెట్టు కిందనుండి మకాం మార్చెయ్యి. ఇక్కడికివచ్చేయి"

రంగయ్య తల అడ్డంగా ఊపాడు.

చెట్టు తన తల్లి అన్నాడు.

తల్లిని వదిలి రాలేనన్నాడు.

తను ఎప్పటికీ చెట్టు కింద రంగయ్యనే అన్నాడు.

అదితప్ప మీరేం చెయ్యమన్నా చేస్తానన్నాడు.

ముసిలాయన నవ్వుకున్నాడు.

సరే అన్నాడు.

ఇవాళ రంగయ్యకి చేతినిండా పని!

రంగురంగుల బొమ్మలు!

అందాల బొమ్మలు!

కొత్త కొత్త బొమ్మలు!

ఆ ఒక్క ఊరే కాదు - మొత్తం జిల్లా - ఉహు రాష్ట్రం - కాదు - దేశం - అదీ కాదు - విదేశాల్లోకూడా.

రంగయ్యబొమ్మలకి జనం ఎగబడసాగారు.

వేలు, వందలు, వచ్చి కురుస్తున్నాయి.

రంగయ్యపేర, ముసిలాయన తెరచిన బేంక్ ఎకౌంట్ లక్షదాటింది.

రంగయ్యమాత్రం ఆ చెట్టు కిందే కూర్చుని బొమ్మలు చేస్తున్నాడు - రాత్రీ - పగలూ - పదిమంది పనివాళ్ళు అతని చేతిక్రింద పనిచేస్తున్నారు. మట్టి తెచ్చేవాళ్ళు - పిసికేవాళ్ళు - ముద్దలు చేసేవాళ్ళు - ఆ ముద్దని ఓ ఆకారంగా చేసి సిద్ధం చేసే వాళ్ళు - వాటికి రంగుపూసేవాళ్ళు.

ఎవరేం చేసిపెట్టినా, ప్రతి బొమ్మా రంగయ్య చేతిలోంచి తుదిరూపం దిద్దు కొనివెళ్ళవలసిందే. అతని కుంచె అందించిన జీవకళని చేర్చుకొని కదలవలసిందే.

తండ్రితాతలు తనకి అందించిన కళ అది-

మట్టి బొమ్మల్లోకి జీవచైతన్యాన్ని ఊదే కళ-

అది కేవలం మట్టిబొమ్మల తయారీ కాదు

చైతన్య రూపాల సృష్టి -

రైతు బొమ్మలు - రాణి బొమ్మలు -

పాదుషా బొమ్మలు - ఫకీరు బొమ్మలు

పేదల బొమ్మలు -సన్నిధుల బొమ్మలు

సమాజానికి అద్దంపట్టే బొమ్మలు - సంస్కృతిని చాటిచెప్పే బొమ్మలు - నీతిని చెప్పే బొమ్మలు - దేశభక్తిని నేర్పే బొమ్మలు.

నాటి బొమ్మలు - నేటి బొమ్మలు - మేటి నాయకుల బొమ్మలు

బొమ్మలతో నిండిన లోకం అది -

తనకి తండ్రి నేర్పిన కళ అది.

ఆ కళని తాను సాగిస్తున్నాడు. దానికి ఎన్నో కొత్త కొత్త అందాలూ సొగసులూ కూరుస్తున్నాడు.

ఎంత చేసినా అంతా ఆచెట్టు కిందే!

చెట్టుని మరిచిపోలేదు రంగయ్య.

చెట్టు తన జట్టు - తను ఎప్పటికీ చెట్టుకింద రంగయ్యే.

పాత నేస్తాన్ని మరిచిపోలేదని రంగయ్యంటే చెట్టుకి ఎంతో అభిమానం.

అందుకే అతణ్ణి అభిషేకిస్తూ ఉంటుంది.

పువ్వులతోటీ, ముత్యాలలాంటి నీటి చినుకులతోటీ - అప్పుడప్పుడు - వజ్రపు తునకల్లాంటి మంచు బిందువులతో కూడా. ఏడాదికోమారు పులకిస్తుంది.

పులకించి కొత్త చిగుళ్ళు వేస్తుంది. కొత్త నవ్వులు నవ్వుతుంది.

అదే చెట్టు -

ఏరోజు కారోజు కొత్తగా కనిపించే పాతచెట్టు -

మనిషికి చిరకాల సంపదగా నిలిచిన చెట్టు -

ఎప్పుడూ ఎత్తుగా ఎదుగుతూ,

"నువ్వుకూడా ఎప్పుడూ ఎత్తుగా, నాలా, ఆకాశం వైపు ఎదుగు" అని చెప్తుంది.

రంగయ్యకే కాదు -

మనకందరికీను -

(తెలుగు విద్యార్థి, జనవరి 2000)

*